# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 25-10-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ఛట్ పూజ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు.
- ❖ మొబైల్ తయారీ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించే దిశగా పయనిస్తోందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ఉదయం 11 గంటలకు ఆకాశవాణిలో "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం ద్వారా దేశ, విదేశాల్లోని భారతీయులతో తన ఆలోచనలను పంచుకుంటారు.
- ❖ ఆగ్నేయ బంగాళాఖాతంలోని అల్పపీడనం అక్టోబర్ 28 నాటికి తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది.

===================

నాలుగు రోజుల పాటు జరుపుకునే ఛట్ పూజ వేడుకలు దేశంలోని వివిధ ప్రాంతాలలో ఈరోజు ప్రారంభమయ్యాయి. పరిశుభ్రతకు ప్రతీక అయిన ఈ పండుగ రోజున భక్తులు సూర్య భగవానుడిని ఆరాధిస్తారు. ఛట్ పూజ మొదటి రోజు కావడంతో భక్తులు పవిత్ర స్నానమాచరించి ఉపవాసం పాటించి ప్రార్థనలు చేస్తారు. ఇక ఛట్ పూజ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ నాలుగు రోజుల పండుగ సాంస్కృతిక ప్రాముఖ్యతను గుర్తు చేసేందుకు ఛఠీమైయాకు అంకితం చేయబడిన భక్తి గీతాన్ని కూడా ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ లో పంచుకున్నారు.

===================

మొబైల్ తయారీ రంగంలో భారతదేశం స్వయం సమృద్ధి సాధించే దిశగా పయనిస్తోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. మరో రెండు సంవత్సరాల్లో మొబైల్ ఫోన్ భాగాల ఉత్పత్తి పూర్తిగా దేశీయంగానే జరుగుతుందని చెప్పారు. న్యూఢిల్లీలో ఈరోజు విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో సీసీ టీవీలతో సహా వివిధ అప్లికేషన్ల కోసం చిప్ సెట్స్ ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. సర్వర్లతో సహా అధిక పనితీరు గల కంప్యూటింగ్ కోసం మైక్రో-ప్రాసెసర్లను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం 200 కోట్ల రూపాయలకుపైగా పెట్టుబడి పెడుతోందని తెలిపారు. అదే విధంగా నకిలీ కంటెంట్ వ్యాప్తిని అరికట్టడంతో పాటూ

ఆన్‌లైన్ కంటెంట్ ప్రామాణికతను ధృవీకరించడానికి వాస్తవ తనిఖీ కోసం చాట్‌బాట్‌ను కూడా అభివృద్ధి చేస్తున్నామని అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలో అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) వైద్య విద్యా సీట్లు 51 వేల నుండి నేడు లక్షా 29 వేలకు పెరిగాయని కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి జె.పి. నడ్డా తెలిపారు. న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) 50వ స్నాతకోత్సవంలో వైద్య విద్యలో దేశం సాధించిన పురోగతిపై ఆయన ఈరోజు ప్రసంగించారు. దేశంలో ఇప్పుడు 819 వైద్య కళాశాలలు ఉన్నాయని, గ్రాడ్యుయేట్ మెడికల్ సీట్ల సంఖ్య దాదాపు 78 వేలకు పెరిగిందని జె.పి.నడ్డా పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల ప్రచారంలో ఉపయోగించే ఏఐ జెనరేటెడ్ వీడియోలు, డిజిటల్ కంటెంట్ కి సంబంధించి రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రచార ప్రయోజనాల కోసం ఉపయోగించే ఏఐ జనరేటెడ్ వీడియోలను  సింథటిక్ కంటెంట్‌గా లేబుల్ చేయాలని.. వాటిపై పెద్ద అక్షరాలతో AI అని పొందుపరచాలని తెలిపింది. అలాగే ఆడియోలైతే మొదటి పది సెకండ్ల నిడివిలోనే ఆ వివరాలు తెలిసేలా పేర్కొనాలని స్పష్టం చేసింది. అదనంగా ఆడియో కంటెంట్‌లో దాని ఉత్పత్తికి బాధ్యత వహించే సంస్థ పేరును కూడా బహిర్గతం చేయాలని తెలిపింది. ఓటర్లను తప్పుదారి పట్టించే ఉద్దేశ్యంతో సృష్టించిన ఏదైనా కంటెంట్‌ను ప్రచురించడం, వ్యాప్తి చేయడం లాంటివి నిరోధించాలని ఎన్నికల సంఘం పిలుపునిచ్చింది. రాజకీయ పార్టీలు అటువంటి కంటెంట్‌ను 3 గంటల్లోగా తొలగించాలని తప్పనిసరి చేసింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఏఐ జెనరేటెడ్ కంటెంట్‌ను బాధ్యతాయుతంగా ఉపయోగించాలనే ఉద్దేశంతోనే ఈ కఠినమైన నియమాలను ఎన్నికల సంఘం తీసుకొచ్చింది.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ఉదయం 11 గంటలకు ఆకాశవాణిలో “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం ద్వారా దేశ, విదేశాల్లోని భారతీయులతో తన ఆలోచనలను పంచుకుంటారు. నెలవారీ రేడియో కార్యక్రమంలో ఇది 127వ సంచిక. ఈ కార్యక్రమం మొత్తం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్‌వర్క్, AIR న్యూస్ వెబ్‌సైట్, న్యూస్ ఆన్ ఎయిర్ మొబైల్ యాప్‌లో ప్రసారం అవుతుంది. AIR న్యూస్, DD న్యూస్, సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ YouTube ఛానెల్స్ లో కూడా ఈ ప్రత్యక్ష ప్రసారం వెలువడుతుంది. హిందీ ప్రసారం అయిన వెంటనే ఆకాశవాణి ఈ కార్యక్రమాన్ని ప్రాంతీయ భాషలలో ప్రసారం చేస్తుంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్ ఎల్లప్పుడూ భారతదేశంలో అంతర్భాగంగానే ఉంటుందని ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ పునరుద్ఘాటించారు. 80వ ఐక్యరాజ్యసమితి దినోత్సవం సందర్భంగా భద్రతా మండలిలో చేపట్టిన చర్చలో ఆయన ఈరోజు ప్రసంగిస్తూ... పాకిస్తాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించిన ప్రాంతాలలో ముఖ్యంగా జమ్మూ కాశ్మీర్‌లో కొనసాగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలకు ముగింపు పలకాలని పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన పరిశోధనల్లో ప్రపంచ ప్రమాణాలను సాధించేందుకు ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నామని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. న్యూఢిల్లీలోని ఢిల్లీ విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ 54వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ.. విద్యారంగం, పరిశోధనలు, పరిశ్రమల మధ్య ఏకీకరణ ముందుకు సాగేందుకు దోహదపడుతుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అంతరిక్షం, బయోటెక్నాలజీ రంగాలలో ప్రైవేట్ రంగానికి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల మధ్య అంతరాన్ని తగ్గించడానికి సహాయపడిందని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం అదే ప్రాంతంలో కేంద్రీకృతమై చెన్నైకి తూర్పు ఆగ్నేయంగా 950 కిలోమీటర్లు, విశాఖపట్నంకు ఆగ్నేయంగా 960 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు ఆగ్నేయంగా 970 కిలోమీటర్ల దూరంలో కదులుతోందని భారత్ వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఇది రేపు తీవ్ర వాయుగుండంగా మారి వాయువ్య దిశగా కదిలి అక్టోబర్ 28 ఉదయం నాటికి తీవ్ర తుఫానుగా మారే అవకాశం ఉందని పేర్కొంది. ఆరోజు సాయంత్రం లేదా రాత్రి సమయంలో కాకినాడ సమీపంలో ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశం ఉందని వెల్లడించింది. ఇక రానున్న రెండు రోజుల పాటూ అండమాన్, నికోబార్ దీవులు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్‌లలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని (IMD) తెలిపింది. రేపు ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలలో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

దీపావళి ఛట్ పండుగల దృష్ట్యా ఏర్పాటు చేసిన ప్రత్యేక రైళ్ల సేవలను ఇప్పటివరకు దాదాపు కోటీ 50 లక్షల మంది ప్రయాణీకులు వినియోగించుకున్నారని రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. పండుగ సీజన్ ముగిసే సమయానికి ఈ సంఖ్య 2 కోట్ల 50 లక్షలకు చేరుకునే అవకాశం ఉందన్నారు. న్యూఢిల్లీలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... రద్దీని సజావుగా నిర్వహించడానికి 30 స్టేషన్లలో హోల్డింగ్ ప్రాంతాలను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో దీపావళి, ఛట్ పండుగల సమయంలో 178 ప్రత్యేక రైళ్లను నడిపేవారని.. నేడు వాటి సంఖ్య 13 వేలకు పైగా ఉందని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =